క్లుప్తంగా

సమస్యల పరిష్కారానికి కృషి



కాలువ సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ లావణ్య

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు కార్పొరేటర్ లావణ్య మంగళవారం పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఆయా ప్రాంతాల ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. శ్రీనివాసనగర్, గుల్లలపాలెం,ములగాడ ప్రాంతాల్లో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆయా ప్రాంతాల వార్డు వలంటీర్లు,గృహ సారథులు పాల్గొన్నారు.

ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్‌లో బెహరా విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న విజయ చైతన్య తదితరులు

గోపాలపట్నం: రాష్ట్ర స్థాయిలో జరిగిన ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌లో బెహరా పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి 5 బంగారు పతకాలు సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను మంగళవారం కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ బెహరా విజయ చైతన్య అభినందించారు. ఈ విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు వెళ్లనున్నారని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుకన్య, పీడీలు ప్రవీణ్, అమర్, బాబు, లావణ్య, సంగీత, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు తెలుసుకోవడానికే యాత్ర

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతం శ్రీహరిపురం మార్కెట్ వద్ద మంగళవారం కార్మిక చైతన్య బస్సు యాత్ర కార్యక్రమం నిర్వహించారు. టీఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలోఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ కార్మికల సమస్యలను తెలుసుకోవడానికి ఈ యాత్ర నిర్వహిస్తున్నామని చెప్పారు. నియోజకవర్గ టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు నక్కా లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

సుప్రీం తీర్పును ఆహ్వానిస్తున్నాం



సమావేశంలో మాట్లాడుతున్న కత్తి పద్మ

అల్లిపురం : బిల్కిస్ బానో కేసులో సుప్రీం తీర్పును ఆహ్వానిస్తున్నామని మహిళా చేతన ప్రధాన కార్యదర్శి కత్తి పద్మ అన్నారు. వీజేఎఫ్ ప్రెస్ క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. బిల్కిస్ బానో నిందితుల విడుదలను ఛాలెంజ్ చేస్తూ సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు కాగా విచారణ చేపట్టిన కోర్టు ముద్దాయిలందరినీ లొంగిపోవాలని ఆదేశించిందన్నారు. ఈ తీర్పు గుజరాత్ ప్రభుత్వానికి గుణపాఠంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో హెచ్‌ఆర్ అనూరాధ, ముస్లిం థింకర్స్ ఫోరం ప్రతినిధి జహీరా, నాస్తిక సమాజం ప్రతినిధి రాంప్రభు, ప్రగతిశీల కార్మిక సమాఖ్య ప్రతినిధి అన్నపూర్ణ, అడ్వకేట్ ఐఎం అహ్మద్ పాల్గొన్నారు.

ఇల చేరిన హరివిల్లు



మనోహరం : మురళీధరుని, మయూరాన్ని, చూడముచ్చటగా తీర్చిదిద్దిన రంగవల్లిక



సంక్రాంతి పండగ శోభను ప్రతిబింబించేలా తీర్చిదిద్దిన రంగవల్లిక



జగనన్న, ఆదారి ఆనంద్ కుమార్‌కు శుభాకాంక్షలు తెలుపుతూ వేసిన ముగ్గు



గోపాలపట్నం హైస్కూల్‌లో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న వారితో నాయకులు, న్యాయనిర్ణేతలు

- ఆకర్షణీయంగా రంగుల రంగవల్లికలు
- వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు
- ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు

హరివిల్లు ఇల చేరినట్లుగా రంగుల రంగవల్లికలతో పశ్చిమ నియోజకవర్గ వాసులకు సంక్రాంతి పండగ ముందే వచ్చింది. కాదేదీ ముగ్గుకు అనర్హం అన్నట్లుగా వనితలు విభిన్నంగా తీర్చిదిద్దిన రంగవల్లులు కనువిందు చేశాయి. తెలుగువారి పెద్ద పండగను వేడుకగా నిర్వహించేలా వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ అన్ని వార్డుల్లో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తుండటంతో అంతటా సందడి నెలకొంది. రెండో రోజు మంగళవారం నిర్వహించిన పోటీల్లో మహిళలు వేసిన ముగ్గులు అ'ద్వితీయం'గా నిలిచాయి.



కావాలని జగన్ అంటూ...

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు యల్లపువానిపాలెం జిల్లా పరిషత్ పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో స్థానిక మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

- 91వ వార్డు లక్ష్మీనగర్ ఈబ్లాక్ మండల ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన పోటీల్లో 100 మందికి పైగా మహిళలు పాల్గొని రంగువల్లులతో ప్రాంగణాన్ని సుందరంగా మార్చేశారు.
- 92వ వార్డు గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహిళలు వేసిన ముగ్గులు ఆకట్టుకున్నాయి. వార్డు వారీగా 5 మంది విజేతలను ఎంపిక చేశారు. వీరు నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటారు. వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షులు గుణిశెట్టి శ్రీనివాసరావు, అప్పలస్వామి నాయుడు, అయితంశెట్టి రేణుకా గోపాలకృష్ణ, పీఏసీఎస్ చైర్మన్ ఆళ్ల పైడిరాజు, కంపర కోటేశ్వరరావు, నీలాపు లోకేశ్వరరావు, చుక్క పైడిరాజు రెడ్డి ఏర్పాట్లు సమీక్షించారు.

కోలాహలంగా ముగ్గుల పోటీలు

విశాఖ విద్య: 90వ వార్డు బుచ్చిరాజుపాలెం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలకు మహిళల నుంచి అనూహ్య స్పందన వచ్చింది. దుర్గాలమ్మ గుడి నుంచి ఎన్‌ఎస్‌టీఎల్ గేటు వరకు రోడ్డుపై రంగు రంగులతో కూడిన ముగ్గులు వేశారు. వీటిని చూసేందుకు పరిసర ప్రాంతాల వారు తరలివచ్చారు. ఇదే చోట భోగి మంటలు వేశారు. ఆనంద్ కుమార్ సూచనల మేరకు వార్డు నాయకుడు నమ్మి శ్రీను ఏర్పాట్లు స్వయంగా పర్యవేక్షించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు చుక్క ప్రసాదరెడ్డి, క్లస్టరు వైఎస్ ప్రెసిడెంట్ రామకృష్ణ, సచివాలయ కన్వీనర్లు సన్యాసిరావు, సత్తిబాబు పూడి సత్యం, అప్పలనాయుడు, వై.వెంకటేశ్వరావు, కిరణ్‌రెడ్డి, సీతారామరాజు నగర్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం నాయకులు కొనాల విజయ వినీత, భాను, ఎం. సత్యవతి, గుణవతి తదితరులు పాల్గొన్నారు.



యల్లపువానిపాలెంలో ముగ్గులను పరిశీలిస్తున్న గోపాలకృష్ణ, ఆళ్ల పైడిరాజు తదితరులు



అందంగా తీర్చి దిద్దిన రంగవల్లులు

మల్కాపురం: సంక్రాంతి సందర్భంగా వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ముగ్గుల పోటీలు రెండో రోజూ కూడా ఉత్సాహంగా జరిగాయి. ఆయా ప్రాంతాలకు చెందిన మహిళలు పాల్గొని సంప్రదాయం ఉట్టిపడేలా రంగవల్లులు వేశారు. జీవీఎంసీ 58,59,60,61వ వార్డుల్లో జరిగిన పోటీలను ఆయా ప్రాంతాల వైఎస్సార్‌సీపీ నాయకులు పర్యవేక్షించారు.

సింధియా: 62వ వార్డు దుర్గానగర్ క్రీడామైదానంలో పోటీలను కార్పొరేటర్ లక్ష్మణరావు పర్యవేక్షించారు.

- 40వ వార్డు ఏకేసీకాలనీలో ముగ్గుల పోటీలను కార్పొరేటర్ నాగేశ్వరరావు ప్రారంభించారు.

మల్కాపురం: ములగాడ హౌసింగ్‌కాలనీలోని ప్రతిభ పబ్లిక్ పాఠశాల వద్ద సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సంప్రదాయ వస్త్రాలు ధరించి సందడి చేశారు. అలాగే క్రాంతినగర్‌లోని సాయిలత పాఠశాల, 58వ వార్డు పిలకవానిపాలెంలోని లక్కీ అమర్ పాఠశాలలో సంక్రాంతి వేడుకలు ఘనంగా జరిగాయి.



తెలుగుదనం ఉట్టిపడేలా..



ఇండస్ట్రియల్‌కాలనీలో..



బుచ్చిరాజుపాలెంలో..



ముగ్గులను పరిశీలిస్తున్న నాయకులు, న్యాయ నిర్ణేతలు



మాట్లాడుతున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు



ముగ్గులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ లక్ష్మణరావు



ప్రతిభ పాఠశాలలో..



బొమ్మలకొలువు వద్ద చిన్నారులు, ఉపాధ్యాయులు

విద్యార్థులకు ఆటవిడుపు



యారాడ చర్చిలో విద్యార్థులు



యారాడ బీచ్‌లో ఉత్సాహంగా గెంతులేస్తున్న విద్యార్థులు

గోపాలపట్నం: నిత్యం పాఠ్య పుస్తకాలతో కుస్తీ పట్టే విద్యార్థులకు ఆటవిడుపు కలిగించారు ఆ పాఠశాల ఉపాధ్యాయులు. లక్ష్మీనగర్ ఈ బ్లాక్‌లోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులను మంగళవారం ఉపాధ్యాయులు పిక్నిక్‌కు తీసుకెళ్లారు. యారాడ బీచ్‌తో పాటు పలు ఆలయాలను చూపించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వరలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులకు సామాజిక అంశాలపై అవగాహన కల్పించడానికి వైజ్ఞానిక విహార యాత్రగా తీసుకెళ్లామని చెప్పారు. యారాడ బీచ్‌లో చిన్నారులు ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారన్నారు.

క్రికెట్ లీగ్ విజేతలకు అభినందన



జట్టు సభ్యులను అభినందిస్తున్న వార్డు కార్పొరేటర్ బెహరా వెంకట స్వర్ణలత శివదేవి

గోపాలపట్నం: ఇటీవల నిర్వహించిన జగనన్న విశాఖ వెస్ట్ క్రికెట్ లీగ్ పోటీల్లో ట్రోఫీ కైవసం చేసుకున్న గోపాలపట్నం హైస్కూల్ జట్టును 92వ వార్డు కార్పొరేటర్ బెహరా వెంకట స్వర్ణలత శివదేవి అభినందించారు. ఈ మేరకు మంగళవారం జట్టు సభ్యులు ఆమెను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమె మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయ కర్త ఆడారి ఆనంద్ కుమార్ నియోజకవర్గంలో మంచి కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. యువకుల్లో ఉత్సాహం నింపేందుకు ఈ పోటీలు నిర్వహించారన్నారు. మహిళల కోసం సంక్రాంతి సంబరాల్లో భాగంగా ముగ్గులు పోటీలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఆయనకు నియోజకవర్గ ప్రజలు అండగా ఉండాలని, అధికారం వస్తే మరిన్ని మంచి పనులు చేస్తారని తెలిపారు.

హిందూ కమిషన్ ఏర్పాటుకు డిమాండ్



సమావేశానికి హాజరైన అతిథులు

అల్లిపురం : స్వయం ప్రతిపత్తి కలిగి జ్యుడీషియల్ స్థాయి గల హిందూ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని, అన్ని రాజకీయ పార్టీలు తమ ఎన్నికల మేనిఫెస్టోలో దీనిని చేర్చాలని హిందూ ధార్మిక పరిషత్ రాజకీయ పార్టీలను డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం హిందూ డిక్లరేషన్ సాధనకు ధార్మిక, సామాజిక ప్రముఖులు, ధార్మిక పరిషత్ ప్రతినిధులు, బ్రాహ్మణ సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు.

ముందుగా కార్యక్రమాన్ని హిందూ ధార్మిక పరిషత్ సభ అధ్యక్షుడు పైడా కృష్ణప్రసాద్ తదితరులు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నెల్లిమర్ల దుర్గాపీఠం పీఠాధిపతి చిన్నస్వామి మాట్లాడుతూ హిందువుల సంప్రదాయాలను, ఆలయాలను పరిరక్షించే దిశగా హిందూ కమిషన్ ముందుకెళ్తుందన్నారు. 26వ తేదీన అన్ని రాజకీయ పార్టీలకు మెమొరాండం ఇస్తామన్నారు. ఈ నెల 22న అయోధ్యలో శ్రీరామ ప్రాణప్రతిష్ఠ చేసే సమయంలో రాష్ట్రంలో అన్ని దేవాలయాల ముందు హిందూ కమిషన్ ఏర్పాటు చేయాలని చట్టబద్ధంగా ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కె. లలిత్, రాగం కిషోర్, బాలాజీ, పీవీ నారాయణ, రాధాకృష్ణ, మాజీ శాసన సభ్యుడు పి.విష్ణుకుమార్‌రాజు, మాజీ ఎంఎల్‌సీ పీవీఎన్ మాధవ్, ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, పీవీ రామారావు, డాక్టర్ రమణమూర్తి, శ్రీనివాస్, సీహెచ్ వెంకటపతిరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధిలో భాగస్వామ్యం అవసరం



డైరీ, క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న డీఈవో చంద్రకళ, సంఘం నాయకులు

విశాఖ విద్య: విద్యాభివృద్ధిలో ఉపాధ్యాయ సంఘాలు భాగస్వామ్యం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని డీఈవో ఎల్.చంద్రకళ అన్నారు. వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ముద్రించిన 2024 సంవత్సరపు క్యాలెండర్లు, డైరీలను మంగళవారం తన చాంబర్‌లో ఫెడరేషన్ నాయకులతో కలసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చొక్కాకుల సూర్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి బాదిరెడ్డి గంగాధర్, జిల్లా ముఖ్యగౌరవ సలహాదారు జగన్నాథరావు, కోశాధికారి సంధ్యారాణి, గోవింద, నాగేశ్వరావు పాల్గొన్నారు.

దేశం గర్వించదగ్గ మేధావి అంబేడ్కర్

- జోనల్ కమిషనర్ సింహాచలం



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్సీ సింహాచలం తదితరులు

గాజువాక: జీవీఎంసీ ఆధ్వర్యంలో సామాజిక సమతా సంకల్పం కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా వందడుగుల రోడ్‌లో అంబేడ్కర్ విగ్రహానికి, జోనల్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి జోనల్ కమిషనర్ పి.సింహాచలం పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ అంబేడ్కర్ అత్యంత సామాన్య కుటుంబం నుంచి వచ్చి ప్రపంచం మెచ్చుకునే మేధావిగా గుర్తింపు పొందారన్నారు. తన మేధస్సుతో దేశానికి దిక్సూచిగా నిలిచారన్నారు. ఆయన ఆశయ సాధనకు అందరం కంకణ బద్ధులు కావాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ఈ నెల 18 వరకు నిర్వహిస్తున్న సామాజిక సమతా సంకల్పం కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ కె.రమణ తదితరులు పాల్గొన్నారు.

14న సింహగిరిపై గోదా కల్యాణం

- 16న గజేంద్రమోక్షం
- ఈ నెల 11 నుంచి 17 వరకు ఆర్జిత సేవల రద్దు
- దర్శనాల వేళల్లో మార్పులు



సింహాచలం: భోగి పర్వదినం పురస్కరించుకుని ఈ నెల 14న సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామి ఆలయంలో గోదా కల్యాణాన్ని విశేషంగా నిర్వహిస్తున్నట్లు సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. ఆ రోజు సాయంత్రం 4 గంటల నుంచి కల్యాణోత్సవ వేడుకలు ప్రారంభమవుతాయన్నారు. ఉదయం జరిగే నిత్యకల్యాణం కూడా గోదా కల్యాణంతో కలిపి నిర్వహిస్తామని వెల్లడించారు. భక్తులంతా ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ నెల 15న మకర సంక్రాంతి పురస్కరించుకుని ఉత్తరాయణం పుణ్యకాలం పూజలు సందర్భంగా ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు దర్శనాలు ఉండవన్నారు. 16న కనుమ పురస్కరించుకుని కొండదిగువ పూలతోటలో గజేంద్రమోక్షం ఉత్సవం ఉంటుందన్నారు. ఆ రోజు సింహగిరిపై సాయంత్రం 4 గంటలకి స్వామి వారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని కొండ దిగువకి తీసుకెళ్తామన్నారు. గజేంద్రమోక్షం ఉత్సవం అనంతరం రాత్రి అడవివరం పుర వీధుల్లో స్వామిని గజ వాహనంపై తిరువీధి నిర్వహిస్తామన్నారు. గ్రామస్తులు పెద్ద ఎత్తున ఈ ఉత్సవంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ ఉత్సవం సందర్భంగా 16న సాయంత్రం 6 గంటల తర్వాత సింహగిరిపై స్వామి దర్శనాలు లభించవన్నారు. తిరిగి 17న ఉదయం 6.30 గంటల నుంచి యథావిధిగా దర్శనాలు ఉంటాయన్నారు. ఈ నెల 11 నుంచి 17 వరకు అన్ని ఆర్జిత సేవలు రద్దు చేసినట్లు వెల్లడించారు. అలాగే సాయంత్రం 7 గంటల తర్వాత దర్శనాలు లభించవన్నారు. ఈ నెల 12న కూడారై ఉత్సవం సందర్భంగా ఉదయం 8.30 గంటల నుంచి 9.30 గంటల వరకు దర్శనాలు లభించవని వివరించారు. భక్తులంతా ఈ విషయాలని గమనించాలని ఈవో కోరారు.

అప్పన్న సన్నిధిలో 'పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ'

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని మంగళవారం పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఆన్ ఎనర్జీ బృందం దర్శించుకుంది. కమిటీ చైర్‌పర్సన్ జగదాంబిక పాల్, సభ్యులు కిసాన్ కపూర్, సునీల్ కుమార్ మోండల్, కేఆర్‌ఎన్.రాజేష్ కుమార్ స్వామిని దర్శించుకున్న వారిలో ఉన్నారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద వీరికి పూర్ణ కుంభంతో అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం వీరంతా ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అంతరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని ఏఈవో భ్రమరాంబ అందజేశారు. సూపరింటెండెంట్ పిళ్లా శ్రీనివాస్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.



అప్పన్న ఆలయంలో కమిటీ చైర్‌పర్సన్ జగదాంబిక పాల్, సభ్యులు

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్ : మార్గశిర మాసోత్సవాల 27వ రోజు మంగళవారం కనకమహాలక్ష్మి అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఉదయం 5 నుంచి 6 గంటల వరకు పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, 6 నుంచి 11 గంటల వరకు సర్వదర్శనం, 11.30 నుంచి 12 గంటల వరకు అమ్మవారికి పంచామృతాభిషేకం, మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సర్వదర్శనం, 6 నుంచి 7 గంటల వరకు విశేష పంచామృతాభిషేకం, అష్టోత్తర నామార్చన పూజ నిర్వహించారు.

108 స్వర్ణపుష్పాలతో కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన జరిపారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన పూజలో, త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

యువ ఉద్యోగులపైనే స్టీల్‌ప్లాంట్ భవిష్యత్తు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ భవిష్యత్తు యువ ఉద్యోగులపై ఆధారపడి ఉందని స్టీల్ ప్లాంట్ కోక్‌ఓవెన్స్ జనరల్ మేనేజర్ ఎం.వి.ఎస్. దుర్గాప్రసాద్ అన్నారు. విభాగంలో మంగళవారం జరిగిన యువ ఉద్యోగుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్లాంట్ ప్రస్తుతం ఉన్న క్లిష్ట పరిస్థితిని ఎదుర్కోవడానికి అందరూ సిద్ధంగా ఉండాలన్నారు. పలు సలహాలు, సూచనలు చేశారు. అదే విధంగా ఉక్కు ఎస్సీ, ఎస్టీ గ్రీవెన్స్ రీడ్రెసల్ కమిటీ సభ్యులు బి.టి.నాయక్, విభాగం హెచ్‌ఆర్ ఇన్‌చార్జ్ డాక్టర్ రాధికలను కలిసి తమ సమస్యలను వివరించారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. విభాగం ఉద్యోగులు అరవింద్ కుమార్, కొమ్ము ప్రసాద్, సురేష్ కుమార్‌ల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వై.మస్తానప్ప, ఎం.వి.వి.సత్యనారాయణ, జి.సురేష్, ఎం.సీతారామ్ పాల్గొన్నారు.

సాయం చేస్తానంటూ మోసం

ఏటీఎం నుంచి రూ.1.02 లక్షల నగదు విత్‌డ్రా

కూర్మన్నపాలెం: సాయం చేస్తానని చెప్పి ఓ వృద్ధుడి వద్ద నుంచి ఏటీఎం కార్డు తస్కరించి, నగదు విత్‌డ్రా చేసిన గుర్తు తెలియని వ్యక్తిపై దువ్వాడ పోలీసులకు ఫిర్యాదు అందింది. ఇందుకు సంబంధించి దువ్వాడ సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలివి.. కూర్మన్నపాలెం ప్రాంతానికి చెందిన గూడూరు స్వామిబాబు (71) ఈ నెల 5వ తేదీన స్థానిక ఎస్‌బీఐ ఏటీఎం సెంటర్‌కు నగదు కోసం వెళ్లారు. ఏటీఎంలో కార్డు పెట్టి నగదు విత్‌డ్రా చేస్తున్నా రాకపోవడంతో వెనుక ఉన్న గుర్తు తెలియని వ్యక్తి నగదు డ్రా చేసి ఇస్తానని చెప్పి, కార్డు తీసుకుని రెండు వేల రూపాయలు నగదు విత్‌డ్రా చేసి స్వామిబాబుకు ఇచ్చి, ఒరిజినల్ ఏటీఎం కార్డు స్థానంలో డూప్లికేట్ కార్డు ఇచ్చి వృద్ధుడిని పంపించి వేశాడు. అనంతరం ఒరిజినల్ ఏటీఎం కార్డును 11 సార్లు ఉపయోగించి ఒక లక్షా రెండు వేల రూపాయల నగదు విత్‌డ్రా చేశారు. మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు స్వామిబాబు దువ్వాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.